# వెన్నెల నావనెక్కి

హేమంతోత్తరీయాన్ని కప్పుకున్న వనం
ఆకులకొనలవేలాడే
మంచుబిందువుల భారాన్ని
మోయలేక అలసిపోతుంది

రాత్రి వలలో చిక్కుకున్న పక్షులు
వేకువజ్ఞాపకాలను స్వప్నిస్తున్నాయి.
నిదురించే లోకం కోసమై ఆకాశం
చుక్కల పహారా పూయించింది.

నిద్రలో శిశువు పెదాలపై
పరచుకునే నవ్వులా చందమామ
నిర్మలంగా, స్వచ్ఛంగా, ప్రకాశంగా వెలిగిపోతుంది
చందమామ చుట్టూ ఊదారంగు వరదగుడి
కాంతి రహస్యాలను నాట్యం చేయిస్తుంది.
సెలయేటి నీరు గులకరాళ్ళతో గలగలా మాట్లాడుతూ
త్రోవ వెంబడి వడివడిగా ప్రవహిస్తుంది.

సముద్రాల కబుర్లనీ, మేఘాల ఊసుల్నీ
వానచినుకుల ముచ్చట్లనీ, కల్మషం లేకుండా
చెప్పుకుపోతున్న అలల పలుకుల్ని చెవులు రిక్కించి
సంభ్రమంతో వింటోంది సుమపాత్రికలోని మకరందం.

గవ్వ గుండెలోని గిరికీలు కొట్టినప్పటి వడిని
ఇంకా కోల్పోని గాలి వయ్యారంగా
వనమంతా కలయ తిరుగుతుంది.

వెన్నెల నావనెక్కి
రాత్రి ఒంటరిగ సాగిపోతోంది
వేకువ తీరానికై.

-- బొల్లోజు బాబా